క్లుప్తంగా

30 మంది యువకుల రక్తదానం



తలగడదీవి(నాగాయలంక): గ్రామంలోని గుజ్జుల రవీంద్ర నగర్ ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శనివారం కాలనీ యువకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. బాపట్ల జిల్లా రేపల్లె ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని నాగాయలంక రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్ ప్రారంభించారు. శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. రేపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ యు.శివన్నారాయణ, రెడ్‌క్రాస్ ఇన్‌చార్జి వి.వాణి, టెక్నికల్ సిబ్బంది డి.వంశీకృష్ణ, కె.లక్ష్మణ్, ఎం.కృష్ణ, పీఏసీఎస్ సీఈఓ వీర్నాల టోని, యర్రంశెట్టి నాగపవన్ తదితరులు పాల్గొన్నారు.

బోరు పంపు ప్రారంభం



గూడూరు: ఇన్సూరెన్స్ వర్కర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గూడూరు మండలం రామానుజ వత్తర్లపల్లిలో ఏర్పాటుచేసిన బోరుపంపును సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ బాపట్ శనివారం ప్రారంభించారు. సర్పంచి రాజుల పాటి రేణుకాదేవి ద్వారా గ్రామంలోని నీటి సమస్యను తెలుసుకున్న సంస్థ ప్రతినిధులు తమ వంతు సహకారంగా దీనిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎం.శివశంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.సూరికుమార్, ప్రతినిధులు ఎంవీ దయాకర్, కె.చంద్రశేఖర్, అద్దంకి సాంబశివరావు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్స్ పరిశీలన




మోపిదేవి: మోపిదేవి గ్రామ సచివాలయం-1, 2లను మచిలీపట్నం డీఎల్‌పీఓ పద్మ శనివారం సందర్శించారు. ఉదయం సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం మోపిదేవి ఎస్టీ కాలనీలో చేపట్టి జగనన్న లే అవుట్స్‌లో గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందివ్వాలని గృహ నిర్మాణ శాఖాధికారులకు సూచించారు. గృహాల ప్రారంభోత్సవానికి తాను తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు. గ్రామ కార్యదర్శి త్రిపురసుందరి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఫణి, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులు



కోనేరుసెంటర్: మచిలీపట్నం మెడికల్ కళాశాల నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శనివారం పరిశీలించారు. నిర్మాణం పూర్తికావస్తున్న ఆరు బ్లాకులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వెంకన్నకు పూజలు



మచిలీపట్నం టౌన్: బలరామునిపేట యతిరాజ భవనంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ పంచమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్లను హనుమంత వాహనంపై నగర వీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం తిరుప్పావడ సేవ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యుడు దోర్ల హేమ ప్రకాష్ తదితరులు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

మచిలీపట్నంటౌన్: ఆదివారం సెలవుదినం అయినా మచిలీపట్నం విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్ ఈఈ ఎం. భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగన్‌తోనే ఉంటాం.. అండగా నిలుస్తాం

- ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'
- సంక్షేమ పథకాల అమలుపై ప్రజల సంతృప్తి
- ప్రభుత్వానికి అండగా ఉంటామంటూ హామీ



పెడన ఆరో వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



అర్థపర్రలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నకుమారి, పార్టీ కార్యకర్తలు



బందరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ జవహర్‌లాల్

పెడన: సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మా ఆర్థికాభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే ఉంటామని, ఆయన ప్రభుత్వానికి అండగా నిలుస్తామని ప్రజలు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలపై వారు సంతృప్తి వ్యక్తంచేశారు. పెడన పట్టణంతో పాటు మండలంలో సచివాలయాల సమన్వయకర్తలు, గృహ సారథులు శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు వారి వారి ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తమకు పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేశారు. పట్టణ సమన్వయకర్త మతీన్‌ఖాన్, మండల సమన్వయకర్త బెజవాడ నాగబాబు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఇంటింటా జై జగన్ నినాదం..

కృత్తివెన్ను: ఠంచన్‌గా ఫించన్ అందుతుంది వార్ధక్యంలో ముదుసలి సంబరం.. మా పిల్లలకు అమ్మఒడి ప్రతి ఏటా ఇస్తున్నారు ఓ తల్లి సంతోషం.. నాకు చేయూత అందింది ఓ వ్యాపారి ఆనందం.. కాపునేస్తం పేరుతో నా ఖాతాకు నగదు జమ అయింది ఓ సోదరి సంతృప్తి.. అత్తమామలు.. అన్నదమ్ములు అంతా ఒకే ఇరుకైన ఇంటిలో కాపురం ఉండేవాళ్లం.. ఇప్పుడు జగనన్న కాలనీలో మాకు ఇంటిస్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి డబ్బులిచ్చారు.. చాలా సంతోషంగా ఉంది.. ఓ చిన్న కుటుంబం ధైర్యం ఇలా ఒకటి కాదు రెండు కాదు ప్రతి ఇంటిలో సంక్షేమ వెలుగులు..అందరి మోముల్లో ఆనంద కాంతులు వెరసి ఇంటింటా జై జగన్ నినాదం వినబడుతోంది. జగనన్నే మా భవిష్యత్తు పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి తమ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చేసిన మంచిని, అందించిన సంక్షేమాన్ని వివరిస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా ప్రజలు జగనన్నపై ఎనలేని ప్రేమ, నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(మోపిదేవి): జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం వెంకటాపురంలో సర్పంచ్ తుమ్మా సోములమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. మాజీ ఎంపీటీసీ అబ్బూరి నాంచారయ్య, తుమ్మా రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. అవనిగడ్డ నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకటనారాయణ (చిన్నారి) పర్యవేక్షణలో శనివారం భావదేవరపల్లిలో జరిగిన కార్యక్రమంలో నాగాయలంక పీఏసీఎస్ చైర్‌పర్సన్ ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు (చంటి), మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పరిశె అమ్మన్న పాల్గొని ప్రభుత్వ పథకాలను వివరించారు. మండలంలోని నాగాయలంక-1, ఏటిమొగ, ఎదురుమొండి, నాచుగుంట సచివాలయాల పరిధిలో జరిగిన కార్యక్రమాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గడపగడపలో జగనన్నే మా భవిష్యత్తు

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. మూడో డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ శీలం బాబ్జీ, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. 14వ డివిజన్‌లో కార్పొరేటర్ కాగిత జవహర్‌లాల్ (బున్ని), 34వ డివిజన్‌లో డివిజన్ కన్వీనర్లు సుంకర రాఘవరావు, ప్రత్తిపాటి ప్రేమ్‌కుమార్, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ అధికారంలో ఉండగా గృహాలకు వచ్చి పథకాలు అందిన తీరును తెలుసుకోలేదని, సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించిన దాఖలాలు లేవని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికి వచ్చి నాయకులు, ప్రజాప్రతినిధులు పథకాల అమలు తీరు, సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పలు డివిజన్లలో నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత థామస్ నోబుల్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, పార్టీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, చిటికిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి వద్దకే పథకాలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఉల్లిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దే అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శనివారం ఉల్లిపాలెం సచివాలయ పరిధిలోని పల్లెపాలెం, శ్రీమన్నారాయణ దేవాలయ సమీప ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు, ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా పథకాలకు సంబంధించిన నగదును కూడా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారని, ఏ సమస్య వచ్చినా ప్రజలు తనను నేరుగా సంప్రదించవచ్చని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉండడంతో పాటు ప్రతి ఇంటి వద్ద మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రజలు అంక్షాక్షిస్తున్నారన్నారు. సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులకు కూడా ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు.

సమస్యలు తెలుసుకుంటూ.. ముందుకు సాగుతూ..

గ్రామాల్లో అంతర్గత రహదారులను నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. విద్యుత్ ఇబ్బందులను తెలిపారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, సర్పంచి వెర్రీ పావని, శ్రీనివాసరావు, ఎంపీటీసీలు సనకా శైలజ, బడే హేమ గంగాధరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, బీసీ, ఎస్సీసెల్ మండల కన్వీనర్లు చేబోయిన కృష్ణారావు, వెన్నా ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలో ఫొటోపై రాజకీయాలు తగదు

అవనిగడ్డ: కార్యకర్తలు వేసిన ఒక ఫ్లెక్సీపై రాజకీయం చేయడం తగదని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం బసవయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సీతాయిలంకలో అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు లేకపోవడంపై వివక్షత చూపుతున్నారంటూ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీపై బుద్ధప్రసాద్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసుకున్న ఫెక్సీని ఎమ్మెల్యేకి ముడిపెట్టడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి ఏఎంసీ చైర్మన్ పదవిని ఎస్సీ అయిన కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావుకి ఇచ్చిన ఘనత ఎమ్మెల్యే సింహాద్రిదేనని చెప్పారు. మీ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఎస్సీల్లో ఎవరు పుట్టాలని కోరుకుంటారని అంటే, తాజాగా మీ నాయకుడు నారా లోకేష్ దళితులు పీకిందేముంది అని యావత్ దళితజాతిని కించపరుస్తూ మాట్లాడారని చెప్పారు. ఈ నీతి వ్యాక్యాలు మీ నాయకులకు చెప్పాలని బుద్ధప్రసాద్‌కు బసవయ్య హితవు పలికారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్‌కుమార్, ఎస్సీ నాయకుడు మద్దాల వీరాస్వామి పాల్గొన్నారు.

పౌరాణిక నాటకాలను ఆదరించాలి

పేర్ని కిట్టు



సత్యహరిశ్చంద్ర నాటకంలోని ఓ సన్నివేశం

మచిలీపట్నంటౌన్: సామాజిక మాధ్యమాల ఉధృతి పెరిగిన నేపథ్యంలో పౌరాణిక నాటక ప్రదర్శనలను కూడా ప్రతి ఒక్కరూ ఆదరించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. మచిలీపట్నం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 29వ వార్షికోత్సవం, తెలుగు నాటక దినోత్సవం కార్యక్రమం శనివారం నగర పాలక సంస్థ ప్రధాన పార్కులో జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించి పేర్ని కిట్టు మాట్లాడారు. కళలను ప్రోత్సహించి కళాకారులకు అండగా నిలవాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ నగ ర కన్వీనర్ గూడవల్లి నాగరాజు, 2వ డివిజన్ కార్పొరేటర్, కళాకారుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు పరింకాయల విజయచంద్రకుమార్, కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల సూరిబాబు, 44వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మామిడిబత్తుల అజయ్, బొర్రా నటేష్‌బాబు, బెల్లంకొండ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర తదితర నాటకాల్లోని పలు ఘట్టాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించండి



వెంకటాపురంలో మట్టి నమూనాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వెంకటాపురం(మోపిదేవి): రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని వ్యవసాయ శాఖ జిల్లా ప్రత్యేక శిక్షణాధికారి ఎస్. సుదర్శన్ అన్నారు. వెంకటాపురంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మట్టి పరీక్ష వారోత్సవాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమతుల ఎరువుల యాజమాన్యానికి మట్టి నమూనాలే మూలాధారమని చెప్పారు. భూమిలో లభ్యమయ్యే ప్రధాన మూలికలు, సూక్ష్మధాతువులు, సమతుల యాజమాన్యం ద్వారా భూసారాన్ని కాపాడటంతో పాటు, ఎరువుల ఖర్చును నియంత్రించవచ్చునన్నారు. మట్టి నమూనా సేకరణ విధానం, పరీక్షా పద్ధతులపై మండలంలోని అన్ని ఆర్‌బీకే వీఏఏ, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం గ్రామంలో పలువురు రైతుల నుంచి 25 మట్టి నమూనాలు సేకరించారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పెడన: రైతులు తమ పంట పొలాల్లోని మట్టిని ప్రతి మూడు పంటలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకుని పంటల దిగుబడిని పెంచుకోవాలని పెడన వ్యవసాయ శాఖాధికారి జీవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని బలిపర్రు ఆర్‌బీకే పరిధిలో భూసార పరీక్షలపై మండలంలోని వీఏఏలు, ఎంపీఈఓలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలతో ఏ భూమికి ఏ మోతాదులో ఏయే ఎరువులు వినియోగించాలో తెలుస్తుందని చెప్పారు. మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు.

13 ఆర్‌బీకేల్లో మట్టి నమూనాల సేకరణ..

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల్లో భూసార పరీక్షలకు సంబంధించి మట్టి నమూనా సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొవ్వ ఏడీఏ ఎస్. శ్యామల, ఏఓ కె. మురళీకృష్ణ మాట్లాడుతూ భూసార పరీక్షలు వల్ల కలిగే లాభాలను వివరించారు. మట్టి నమూనా సేకరణ ద్వారా భూసార పరీక్షలు చేసి నేలకు అనువుగా ఎలాంటి ఎరువులు వాడాలనేది రైతులకు వివరిస్తామన్నారు. దీనివల్ల అవసరమైన మేరకే ఎరువుల వినియోగం జరగడం వల్ల భూసారం పెరుగుతుందని, రైతులకు ఖర్చులు తగ్గుతాయని వివరించారు. ఉచితంగా చేసే భూసార పరీక్షలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

17న విజేతలకు బహుమతుల ప్రదానం

నాగాయలంక: మండల స్థాయి బాల, బాలికలు, ఉపాధ్యాయుల క్రీడా పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ఆవరణలో సోమవారం నిర్వహిస్తామని ఎంఈఓ, క్రీడల కమిటీ చైర్మన్ టీవీఎం రామదాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 లకు జరిగే కార్యక్రమానికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్సీలు టి.కల్పలత, కేఎస్ లక్ష్మణరావు, డీఈఓ తాహెరా సుల్తానా హాజరవుతారని చెప్పారు.

ఉపాధి పనులు ప్రారంభం

నాగాయితిప్ప(మోపిదేవి): నాగాయితిప్ప శివారు పోచిగానిలంక కృష్ణా కరకట్ట వద్ద బాతుల్లంక డొంకలో ఉపాధి పనులను సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు(బుల్లి) శనివారం ప్రారంభించారు. పుప్పాల సతీష్(నాని) పొలం నుంచి కృష్ణానది అంచు వరకు డొంక ఇరువైపులా మురుగు డ్రెయిన్ తవ్వకాలు చేపట్టామని ఎఫ్ఏ వి. కిరణ్‌కుమార్ తెలిపారు. 3 వేల మీటర్లు పొడవు, 2 మీటర్ల వెడల్పు, ఒక అడుగు లోతుతో డ్రెయిన్ తవ్వకం ప్రారంభామని వివరించారు. మొత్తం ఏడు వేల పని దినాలు కల్పించనున్నామన్నారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, లింగం జగదీష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీలు

బంటుమిల్లి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బంటుమిల్లి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో బంటుమిల్లి, పెదతుమ్మిడి, మల్లపరాజుగూడెం గ్రామాల్లో అగ్నిమాపక శకటం, గ్రామస్తులతో కలిసి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోని కూడళ్ల వద్ద వేసవిలో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఫైర్ ఆఫీసరు జి. వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవిస్తే వెంటనే బంటుమిల్లి ఫైర్‌స్టేషన్ 08672-232201 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



మోపిదేవి జెడ్పీ పాఠశాల నుంచి పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మోపిదేవి: మండలంలోని మూడు సెంటర్లలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు మోపిదేవి జెడ్పీ పాఠశాలలో 191మందికి 191 మంది, స్థానిక గురుకుల పాఠశాలలో 93కి 93 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాలలో 55 మంది వి ద్యార్థులకు గాను 53 మంది విద్యార్థులు హాజరుకాగా, ఇద్దరు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్లు కొడాలి బాలనాగేశ్వర శర్మ, ఎ. వెంకటేశ్వరరావు, కృష్ణప్రసాద్ వివరించారు.

కృత్తివెన్ను: పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. మండల వ్యాప్తంగా 11 ఉన్నత పాఠశాలల నుండి ఈ ఏడాది 386 మంది రెగ్యులర్ విద్యార్థులు, 37 మంది ప్రైవేటు విద్యార్థులు రాశారని ఎంఈఓ ప్రసాద్ తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు.

చేపల వేట నిషేధంపై అవగాహన

కృత్తివెన్ను: ఈ నెల 15వ తేదీ నుండి జూన్ 14వ తేదీ వరకు మత్స్యసంపద పునరుత్పత్తి సమయం కావడంతో ఈ సమయాన్ని చేపల వేట నిషేధంగా ప్రకటించారని ఫిషరీస్ ఏడీ సీహెచ్ నాగబాబు తెలిపారు. దీనిపై శనివారం మండల పరిధిలోని తీర గ్రామాలైన ఏటిపవర్ పల్లెపాలెం, చినగొల్లపాలెం, ఒర్లగొంది తిప్పలలో మత్స్యకారులు, బోటు యజమానులకు అవగాహన కల్పించారు. మత్స్యసంపద అభివృద్ధి చెందే సమయంలో సముద్రంలో చేపల వేట నిషేధమన్నారు. మెరైన్ సీఐ మోహన్‌కుమార్, ఎస్ఐలు కాళీ చరణ్, రామకృష్ణ, ఎఫ్‌డీఓ అంజని పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం సైకిల్ యాత్ర

బంటుమిల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీరు గార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఉపాధి కూలీలు సంఘటితంగా వ్యతిరేకించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మురాళ్ల రాజేష్ అన్నారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం పరిరక్షణకై మండలంలోని పలు గ్రామాల్లో సైకిల్‌యాత్ర నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద నాయకులు కూలీలనుద్దేశించి ప్రసంగించి కేంద్ర ప్రభుత్వ ఆలోచనలను వివరించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చౌటుపల్లి రవి, సీపీఎం, రైతు సంఘం నాయకులు జి. నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు, ఎల్.అజయ్‌ఘోష్, బీవీ శ్రీనివాస్, ఆర్‌సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లిలో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లికి చెందిన వృద్ధురాలు శనగల నాగేశ్వరమ్మ పూరిల్లు శనివారం సాయంత్రం దగ్ధమైంది. నాగేశ్వరమ్మ భర్త గతంలోనే మృతిచెందాడు. కుమార్తెకు వివాహం కావడంతో అత్తారింటికి వెళ్లిపోయింది. ప్రస్తుతం నాగేశ్వరమ్మ ఒంటరిగా పూరిపాకలోనే జీవిస్తోంది. గ్రామస్తులు మంటలను అదుపుచేశారు. పూరిపాక దగ్ధం కావడంతో నాగేశ్వరమ్మ కట్టుబట్టలతో మిగిలింది. వీఆర్వో రమణ ఘటనాస్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

ప్రకటన

[illegible]

ప్రకటన

[illegible]

నా గౌరవానికి ఎలాంటి భంగం కలుగలేదు

ఏఎంసీ చైర్మన్ వీర వెంకటేశ్వరరావు

అవనిగడ్డ: తొలిసారి ఏఎంసీ పదవిని ఎస్సీ అయిన తనకు ఇచ్చి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఎంతో గౌరవం ఇచ్చారని, తన గౌరవానికి ఎలాంటి భంగం కలుగలేదని ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీకి అందించిన సేవలకు గుర్తుగా తనకు చైర్మన్ పదవి ఇచ్చి ఎమ్మెల్యే సింహాద్రి సముచిత స్థానం కల్పించారన్నారు. ఫ్లెక్సీలో ఫొటో వేయలేదని తన గౌరవానికి భంగం కలిగించినట్లు మాజీ ఉప సభాపతి బుద్ధప్రసాద్ విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చేస్తున్నారని చెప్పారు. అలాంటి ఎమ్మెల్యేని రాజకీయంగా ఎదుర్కోలేక చౌకబారు విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

వాహనాల తనిఖీ

చల్లపల్లి: జిల్లా ఎస్పీ ఆదేశాలతో విస్తృత తనిఖీలు నిర్వహించామని అవనిగడ్డ డీఎస్పీ మహమ్మద్ మహబూబ్ బాషా అన్నారు. శనివారం రాత్రి డీఎస్పీ, చల్లపల్లి సీఐ బి.భీమేశ్వర రవికుమార్, ఎస్ఐ సీహెచ్ చినబాబు తమ సిబ్బందితో కలిసి స్థానిక ప్రధాన కూడలిలో, జాతీయ రహదారి-216పై ఆటోడ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, టిప్పర్ల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని, బహిరంగ ప్రదేశాల్లో, రహదారుల పక్కన మద్యం సేవిస్తున్న 11 మందిని గుర్తించారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 24 వాహనాల యజమానులకు జరిమానా విధించారు.

మోపిదేవిలో..

మోపిదేవి: అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో మోపిదేవి బస్టాండ్ వద్ద శనివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు సంబంధించి రికార్డులు, లైసెన్సులు తనిఖీ చేశారు. పలువురికి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా విధించారు. ఎస్ఐ పద్మ, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ధర్నా

చల్లపల్లి: రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని మొవ్వ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మొవ్వ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. న్యాయవాదులపై దాడులు, హత్యాకాండలు, దౌర్జన్యాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ చట్టం అవసరమన్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో చట్టం తెచ్చి అమలు చేస్తున్నారని తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లూరి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు కూరేటి శ్రీవెంకటేశ్వరరావు, కార్యదర్శి మోపిదేవి ద్వారకానాథ్, సరస్వతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

49 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కోడూరు: పిట్టల్లంక గ్రామంలో శనివారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద నేత్ర వైద్య నిపుణులు లక్ష్మీ అవ్వా తాతలు 49మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో ఎనిమిది మందికి శస్త్ర చికిత్సలు, 15 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. అపరేషన్లను ఉచితంగా చేయడంతో పాటు కళ్లజోళ్లను కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. సీహెచ్‌ఓ ధనలక్ష్మీ, సచివాలయ కార్యదర్శి కుమార్, ఏఎన్ఎం ఎం.సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.